నవతెలంగాణ
అనుదినం... జనస్వరం
సమగ్ర తెలుగు దినపత్రిక

# రెండో దశ మెట్రోతో గ్లోబల్ సిటీగా హైదరాబాద్

- ఎల్అండ్‌టీ సహకారంతో నగరానికి వరంగా మారిన మెట్రో రైలు
- ఏడేండ్లలో ప్రజలకు అత్యాధునిక సౌకర్యాలతో మెట్రో అందుబాటులోకి..
- పర్యావరణ, ట్రాఫిక్ సమస్యలకు మెట్రో ఒక్కటే పరిష్కారం : హెచ్ఏఎంఎల్, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి
- అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో ఘనంగా హైదరాబాద్ మెట్రో 7వ వార్షికోత్సవం
- వినియోగదారుల కోసం గ్రీన్‌మైల్స్ లాయల్టీ క్లబ్ ఆవిష్కరణ



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మెట్రో రెండో దశ వల్ల హైదరాబాద్ ప్రపంచంలోనే ఉన్నత నగరాల సరసన చేరుతుందని, గ్లోబల్ సిటీగా అవతరించనుందని హెచ్ఏఎంఎల్, హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రారంభించి ఏడేండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఎల్అండ్‌టీ మెట్రో రైల్ ఆధ్వర్యంలో గురువారం అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎల్అండ్‌టీ మెట్రో రైలు ఎండీ కేవీబీరెడ్డితో పాటు సంబంధిత అధికారులు హాజరై ఏడేండ్ల అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, యువచిత్రకారులు బృందం మెట్రో ప్రాముఖ్యతను తెలియజేస్తూ.. గీసిన చిత్రం అందరిని ఆకట్టుకున్నది. అనంతరం మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ ఎల్అండ్‌టీ మెట్రో రైల్ సంస్థ సహకారంతో మెట్రో రైల్ నగరానికి ఒక వరంగా ఆవిష్కృతమైందన్నారు. ఎన్నో సవాళ్లు ఎదుర్కొని ఈ ఏడేండ్లలో ప్రజలకు అత్యాధునిక సౌకర్యాలతో మెట్రో రైల్‌ని అందుబాటులోకి తేగలిగామని ఆయన చెప్పారు. 90 లక్షల వాహనాలతో హైదరాబాద్ రవాణా విపరీతంగా పెరిగిపోయిందనీ, ఇటువంటి పరిస్థితుల్లో మెట్రో రైల్ ఒక్కటే ఈ సమస్యకు ప్రధానమైన పరిష్కారమని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. నగర ప్రజా రవాణా వ్యవస్థలో హైదరాబాద్ మెట్రో రైలు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. రెండో దశ మెట్రో విస్తరణతో ప్రజలకు మరింత మేలు చేకూరుతుందన్నారు. ఓల్డ్‌సిటీ మెట్రోకు ఇప్పటికే భూసేకరణ ప్రారంభమైందని ప్రాథమిక పనులు త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఇందుకు నిధులు కొరత ఉండదని, సీఎం రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టును విజయవంతంగా చేపట్టడానికి తగు ఆదేశాలు ఇచ్చారన్నారు. రెండవ దశ మెట్రోకు కేంద్ర ప్రభుత్వ అనుమతి లభించిన తర్వాత పెట్టుబడి పెట్టడానికి అనేక మల్టీ లేటరల్ డెవలప్‌మెంట్ బ్యాంకులు సుముఖత చూపిస్తున్నాయని మెట్రో ఎండీ వెల్లడించారు. ఎల్అండ్‌టీ మెట్రో రైల్ సీఎండీ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడేండ్ల మెట్రో ప్రస్థానంలో ప్రజలకు గొప్ప సౌకర్యాలతో సేవలు అందించగలిగామన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గించడంతోపాటు వాయు నాణ్యత మెరుగపర్చడంలో మెట్రో రైలు దోహదపడిందన్నారు. సామాజిక అభివృద్ధి, సుస్థిర పర్యావరణానికి మెట్రో రైలు ఉత్ప్రేరకంగా పని చేస్తుందన్నారు. పెరుగుతున్న ప్రయాణీకుల రద్దీకి తగ్గట్టుగా ఒక ప్రణాళికాబద్ధంగా మెట్రో రైళ్ల ఆపరేషన్‌ని మరింత సమర్థవంతంగా చేపట్టనున్నామని, కొత్త కోచ్‌లను తెప్పించే ప్రయత్నాన్ని ముమ్మరంగా చేస్తున్నామని ఆయన తెలిపారు. ఎల్అండ్ టీ చేపట్టిన ప్రతీ ప్రాజెక్టు విజయవంతమైందనీ, రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు మంచి సహకారాన్ని అందిస్తోందన్నారు. రానున్న మూడు నాలుగేండ్లలో హైదరాబాద్ మెట్రో రైలు లాభాల బాట పడుతుందని కేవీబీరెడ్డి తెలిపారు. మెట్రో ప్రయాణికుల కోసం గ్రీన్ మైల్స్ లాయల్టీ క్లబ్‌ను ఆవిష్కరించామనీ, ప్రయాణికుల ప్రయోజనం కల్పించేలా, వారితో సానుకూల బంధాన్ని పెంపొందించుకోవడమే దీని లక్ష్యమని ఆయన తెలిపారు.

### మెట్రో రైల్ ముఖ్యమైన అంశాలు

- గడచిన ఏడేండ్లలో మొత్తం ప్రయాణీకులు 63.40 కోట్ల మంది జర్నీ
- 13.40 కోట్ల లీటర్ల ఇంధనం ఆదా కాగా.. 0.35 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గింపు.
- ప్రయాణ సమయం 50శాతం తగ్గింపు (రోడ్డు ప్రయాణంతో పోలిస్తే).
- సౌర శక్తి.. సంవత్సరానికి 8.35 ఎండబ్ల్యూపీ ఉత్పత్తి కాగా మెట్రో 12శాతం విద్యుత్ అవసరాలు ఈ సౌరశక్తి ద్వారా భర్తీ చేసుకుంటోంది.
- రీజెనరేటివ్ బ్రేకింగ్ సిస్టమ్ ద్వారా 35శాతం విద్యుత్‌ని పునరుత్పత్తి చేయగలుగుతున్నది.
- టీ-సవారీ యాప్.., క్యూఆర్ కోడ్ ఆధారిత టికెటింగ్ (మేక్‌మై ట్రిప్, గోఐబీబో, పేటీమ్, ఫోన్‌పే, గూగుల్ పే మొదలైనవి).
- వాట్సాప్ అండ్ గూగుల్ వాలెట్ ఆధారిత టికెటింగ్ దేశంలోనే డిజిటలైజేషన్‌లో అద్భుతమైన ప్రగతి సాధింపు.

Date: 29/11/2024, Edition: HYDERABAD MAIN, Page: 12
Source : https://epaper.navatelangana.com/